క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

కాటారం: కాటారం 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గారెపల్లి 11 కేవీ ఫీడర్ ఎల్‌సీ కారణంగా గారెపల్లి టౌన్‌లో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈఈ మేఘనాథ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

కార్మికుల కోర్కెల దినం విజయవంతం



మహాముత్తారం: మండల కేంద్రంలో కార్మికుల కోరికల దినం విజయవంతంగా జరిగిందని సీపీఎం మండల కార్యదర్శి పోలం చిన్న రాజేందర్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. గత పదేళ్లుగా సాగించిన సంస్కరణలు ప్రైవేటీకరణ విధానాలను వేగంగా అమలు చేసేందుకు మళ్లీ నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తామని బీజేపీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

ఏజెన్సీలో అక్రమ నిర్మాణాలను ఆపాలి



వెంకటాపురం(కె): ఏజెన్సీలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా వలస గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను ఆపాలని కోరుతూ గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రేగ గణేష్ మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. మండలంలో విచ్చల విడిగా గ్రావెల్ దందా నిర్వహిస్తున్న అధికారులు చోద్యం చూస్తునారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చింత మోహన్, కనితి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి ఫీవర్ సర్వే



వెంకటాపురం(కె): మండల పరిధిలోని రామచంద్రాపురంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఎంత మంది సభ్యులు ఉన్నారు. వారిలో ఎవరైన జ్వరాల బారిన పడ్డారా అనే విషయాలను సర్వే చేశారు. అనంతరం గ్రామంలో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్తులకు పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బోరునర్సాపురం గ్రామానికి చెందిన గుజ్జుల రాంచంద్రారెడ్డి, ఆయన భార్యతో కలిసి బైక్‌పై మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నారు. ఇంటికి వస్తుండగా రోడ్డు దిగుతున్న క్రమంలో మల్లూరు వైపు నుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో రెండు వాహనాలపై ఉన్న ముగ్గురు కింద పడిపోయారు. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. బంధువులు, స్థానికుల సాయంతో గాయాలైన ముగ్గురిని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్‌కు..

మంగపేట: మండలంలోని తిమ్మంపేటకు చెందిన కేబుల్ ఆపరేటర్ జోజేశ్వర్‌రావు విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్‌వైర్ సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడటంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. తిమ్మంపేట నుంచి బాలన్నగూడెం గ్రామానికి వెళ్లే విద్యుత్ లైన్ స్తంభానికి ఉన్న కేబుల్ వైర్‌ను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలింది. దీంతో స్తంభంపైనుంచి పడడంతో జోజేశ్వర్‌రావుకు స్వల్పగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

‘ఆశ’లకు కనీస వేతనాలు ఇవ్వాలి



చిట్యాల : తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న భూక్యా నవీన్



కాటారం : తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

చిట్యాల: ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి వారికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భూక్యా నవీన్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశ వర్కర్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వ రంగసంస్థలపై ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఎండీ. ఖాజా మోహియొద్దీన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ మండల అధ్యక్షురాలు కుంచాల రాధిక, సాయివేద, సుమలత, మానస, కళ్యాణి, రమ, భాగ్యలక్ష్మి, లక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కాటారం: కేంద్ర ప్రభుత్వం ఆశ కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు అందించాలని మండలంలోని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కోర్కెల దినం నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆశ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని ఆ శ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపులతో ఎంతో మేలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి రూరల్: గ్రామీణ ప్రాంత పేద ప్రజలు పట్టణాలకు వెళ్లి ఖరీదైన వైద్యం చేయించుకోలేని వారికి ఈ హెల్త్ క్యాంపులు ఎంతో మేలు జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. బుధవారం భూపాలపల్లిలోని కేకేఎంఎస్ ప్రసాద్ హాస్పిటల్‌లో ప్రతిమ రిలీఫ్ హాస్పిటల్, అమృత వర్షిణి ఫౌండేషన్ భూపాలపల్లి వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత పేద ప్రజల కొరకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. పేద ప్రజలకు ఖరీదైన నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయని పేర్కొన్నారు. శిబిరంలో డాక్టర్లు వందలాది మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రహరీ నిర్మాణం నిధుల కోసం వినతి



వినతిపత్రం అందజేస్తున్న సుగుణ, విజయరెడ్డి

కాటారం: మండల కేంద్రంలోని తిమ్మనకుంటలో ఏర్పాటు చేసిన మినీ స్టేడియం ప్రహరీ నిర్మాణం చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ ఆంగోతు సుగుణ, మాజీ ఎంపీటీసీ ఉడుముల విజయరెడ్డి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ప్రహరీ లేకపోవడంతో స్టేడియం భూమి ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సుగుణ, విజయరెడ్డి తెలిపారు.

సాయిబాబా ఆలయ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలోని సాయిబాబా ఆలయ నూతన కమిటీని ఆలయ ప్రాంగణంలో బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బత్తుల తిరుపతి, గౌరవ అధ్యక్షులుగా జనగాం బాపు, జంగిడి శ్రీనివాసులను ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా జంగిడి సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా కోలేటి రాజబాబు, జనగామ శంకర్, కోశాధికారిగా ఉప్పట్ల ప్రభాకర్, ముఖ్య సలహాదారులుగా జనగాం పోచయ్య, వాల యాదగిరిరావు, మీడియా ఇన్‌చార్జ్, ప్రచార కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉచిత బస్సు సర్వీసు ప్రారంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ మల్హల్‌రావు

మల్హర్: మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల రవాణా సౌకర్యార్థం తాడిచర్ల ఏఎమ్మార్ కంపెనీ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సర్వీసును మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్క భాస్కర్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్హల్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించినందుకు ఏఎమ్మార్ కంపెనీ యాజమాన్యానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీపీ మల్హల్ రావును ప్రధానోపాధ్యాయుడు భాస్కరావు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు చోటు ఇవ్వొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నాగార్జునరావు

కాటారం: గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు, శక్తులకు చోటు ఇవ్వొద్దని సీఐ నాగార్జునరావు అన్నారు. మండలంలోని ఆదివారంపేటలో బుధవారం రాత్రి కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు నిర్వహించి సరైన ధృవీకరణ పత్రాలు లేని బైక్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలు, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేయొద్దని తెలిపారు. గుడుంబా, గంజాయి విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీఐ కోరారు. కార్యక్రమంలో కాటారం, మహాముత్తారం, కొయ్యూర్ ఎస్సైలు మ్యాక అభినవ్, హరిశంకర్, మహేందర్, నరేశ్‌పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



మైక్ సెట్ అందజేస్తున్న రాజయ్య

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట ప్రభుత్వ పాఠశాలకు గ్రామ మాజీ సర్పంచ్ అమ్ముల రాజయ్య బుధవారం మైక్ సెట్ వితరణ చేశారు. మైక్‌సెట్ బహూకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ వారు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఒంటేరు చంద్రశేఖర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జంపాల మమత, ఉపాధ్యాయులు కృష్ణ, కుమారస్వామి, శ్రీధర్, దామోదర్, చక్రధర్, శిరీష, కల్పన, రజిత, ప్రసాద్, రాజేందర్, కోటిలింగం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు భూపాలపల్లి ఏరియాలో కొనసాగుతున్నాయి. జీఎం కార్యాలయం ఎదుట చేపడుతున్న దీక్షలు బుధవారం నాటికి 4వ రోజుకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం విధానాలను మార్చుకోవాలని లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలను ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. దీక్షలో నాయకులు నూకల చంద్రమొగిలి, మాతంగి రాంచందర్, వెంకటేష్, సత్యనారాయణ, శ్రీను, గణేష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ



వాజేడు : విద్యార్థులకు సూల్‌బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు



వెంకటాపురం(కె) : విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న ఉపాధ్యాయురాలు రాజమ్మ

వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో బుధవారం గ్రేస్‌సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వాసం విజయలక్ష్మి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచిపేరు తీసుకు రావాలని సూచించారు. గ్రేస్ సర్వీస్ సొసైటీ సేవలను అభినందించారు. చైల్డ్ కేర్‌సెంటర్ ఉపాధ్యాయురాలు పార్వతి, పాస్టర్ కంతి శ్యామ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండలంలోని టేకులబోరు, రామచంద్రాపురం, మొర్రవానిగూడెం, ఆలుబాక, ఎదిర, బర్లగొంద గ్రామాల్లో 500 మంది నిరుపేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పుస్తకాలు, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మొర్రవానిగూడెం పాఠశాల హెచ్‌ఎం రాజమ్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థను అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చైల్డ్ కేర్ సెంటర్ ఇన్‌చార్జ్ రాజేష్, పున్నం, ఆంజనేయులు, ముత్తయ్య, సంతోష్, సాధన, శంకర్, స్వప్న పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం



ఏటూరునాగారం: శివాజీకి ఆర్థికసాయం అందజేస్తున్న సీఐ, ఆలయ కమిటీ సభ్యులు



వాజేడు : ధర్మతేజకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్సై కృష్ణ ప్రసాద్

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురానికి చెందిన బొమ్మరాజు శివాజీ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడికి ఎస్సై అనుముల శ్రీకాంత్ ద్వారా రూ.30వేల ఆర్థికసాయాన్ని బుధవారం మండల కేంద్రంలో సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం ఆలయంలో క్రీడాకారుడిని సన్మానించారు. ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ మాట్లాడుతూ సీఐ, స్నేహితులు, ఎన్ఆర్ ఐ ద్వారా రూ. 55,500లను ఆర్థిక సాయం అందజేశామన్నారు. జార్జెన్ దేశంలో మన దేశం తరపున ఆడేందుకు 16 మంది క్రీడాకారులు వెళ్తున్నట్లు తెలిపారు. అందులో మన ములుగు జిల్లా నుంచి క్రీడాకారుడు అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనడం అందరికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో కోచ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన ధర్మతేజకు బుధవారం పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ బుధవారం రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కాగా ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఎంపిక జరిగిన తైక్వాండోలో జాతీయ స్థాయిలో 54 కిలోల విభాగంలో గోవాలో ఈ నెల 13 నుంచి 15 వరేకు జరిగే క్రీడల్లో పాల్గొనన్నుట్లు తెలిపారు. ధర్మతేజ నేషనల్ స్థాయికి ఎంపికైనట్లు కోచ్ పాయం సురేష్ తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



మంగపేట : స్థానిక కస్తూర్బా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్సార్‌ఖాన్ పుట్టినరోజు సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మంగపేట పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రాజుపేటలో నిర్వహించిన పుట్టిన రోజు వేడుకలకు మంత్రి సీతక్క తనయుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరీ ధనసరి సూర్య ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు నాగేంద్రబాబు, నరేందర్, నవీన్, లక్కీ, ముకుందం, నరేష్, సాయి. ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రావు సేవలు అభినందనీయం



భాస్కర్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంగపేట: మండలంలోని రాజుపేట ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవీ పొందిన గెజిటెడ్ హెచ్‌ఎం రావుల భాస్కర్‌రావు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. రాజుపేట గ్రామంలోని పాఠశాలలో బుధవారం పదవీ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు ఆయన సతీమణిని పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పాఠశాలకు, విద్యార్థినీ విద్యార్థులకు ఆయన ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. నిత్య జీవితంలో కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో గడుపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏఎంఓ కాటా మల్లారెడ్డి, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, టీఎస్ యూటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు యాకూబ్‌రెడ్డి, చందా భద్రయ్య, గుండం పురుషోత్తం, జాటోత్ సురేష్‌నాయక్, సీనియర్ ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవలతోనే గుర్తింపు



సర్వర్ అహ్మద్‌ను సన్మానిస్తున్న మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ

ఏటూరునాగారం : ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తోందని మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. ఏటూరునాగారం మండలంలోని పప్కాపురం ప్రాథమిక పాఠశాలలో 14 ఏళ్ల పాటు సర్వర్ అహ్మద్ హెచ్‌ఎంగా సేవలు అందించిన ఆయన ములుగు మండలం లక్ష్మీదేవిపేట పాఠశాలకు బదిలీ అయ్యాడు. ఈ సందర్భంగా సర్వర్ అహ్మద్‌ను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు వలియాబీ హాజరై ఆయనను సన్మానించి మాట్లాడారు. గ్రామస్తులు సహకారంతో రెండు ఎకరాల భూమిని విరాళంగా సేకరించి అట్టి భూమిలో రెండు బిల్డింగులను, మరుగుదొడ్లను క్రీడా మైదానం, హరితహారం మొక్కలను, పెంచడం జరిగిందన్నారు. బదిలీ అనేది ఉద్యోగస్తులకు సర్వ సాధారణ అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోరగట్ల రవీందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రాడ్యుయేట్ సంఘం అధ్యక్షులు సయ్యద్ సర్దార్ పాషా, కొండపర్తి సదానందం, సమ్మక్క, కుమారి, భిక్షపతి, జగన్, రామారావు, సతీష్, సాంబయ్య, రాజ్‌కుమార్, రామకృష్ణ, నీలమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మంగపేట : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి అన్నారు. మండలంలోని కోమటిపల్లిలో బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. జ్వరంతో బాధడుతున్న 13 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి ర్యాపిడ్ ఫీవర్ పరీక్షలు నిర్వహించిచారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో దగ్గు, జలుబు ఉన్న విద్యార్థులను గుర్తించి మందులను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలపై సూచనలు, సలహాలు ఇచ్చా రు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఏఎన్ఎం స్వరూప, జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.